# • సీతాపతి వధ

—శ్రీమతి—
లోకనిండి
సత్యవతీ
బాయి

తా నపేక్షించినది పరాయత్తమై పోవడంతో అతనిలోని అసూయ హాలాహలమైపోయింది.

ఆ హాలాహలానికి సీతాపతిని ఆహుతి చేసివేద్దామను కున్నాడు రామారావు, కాని...

ఈర్ష్యాహృదయుడికి కార్యాచరణలో మన్నూమిన్నూ కన పడదూ...?

* * * * * *

దీర్ఘాలోచనా నిమగ్నుడైన రామారా వొక్కసారి తనగది నలువైపులా దృష్టినిసారించాడు. ప్రతి వస్తువూ యథాప్రకారంగానేవుంది. తాను వ్రాలివున్న ఆ యారామపుకుర్చీ తక్కిన ఆ రెండు చిన్నకుర్చీలూ, మూలను ఒక వ్రాతబల్లా, దానిమీద చక్కని ఖద్దరు అద్దకపుగుడ్డా, ఆ చిన్న అలమారూ, దాన్నిండా చక్కని నవలలూ, కిటికీలోంచి వస్తూన్న ఆ చల్లని పిల్లగాలీ అన్నీ పూర్వపుమోస్తరుగానే వున్నవి.

ఈ వాతావరణములోనేగదూ తానంత చీకాకులేకుండా, నిదానముగా సీతాపతిని చంపే ప్లాను తయారుచేశాడు. తన ప్రణాళికప్రకారము చూస్తే విజయము తప్పక చేకూరుతుందన్న దృఢవిశ్వాసము కలుగుతోంది. అసలు ఆటలోని మొదటెత్తు అప్పుడే వేశేశాడుగా! అనవసరమైన గడబిడలేకుండా ఎంతో ఏర్పాటుతో, గాఢాలోచనాఫలితమైన తన ప్లానుప్రకారము హత్య, కాదు—సీతాపతి చావు—తటాలున, పొరబాటున జరిగిపోయిందన్నట్లు నెరవేరి తీరాలి.

ధర్మాప్లాస్కులోని స్ట్రాంగుకాఫీని కప్పులోపోసుకు, మెల్లమెల్లగా త్రాగుతూ రామారావు చిరునవ్వు నవ్వుకున్నా డొకసారి.

ఎంతటి నూతిలోని గుండులాంటి మనిషితాను. ఎన్నడూ పైకి తేలలేదుగదా అతని కడుపులోని ఈసు. హృదయాంతరాళంలో దాచివుంచాడా క్రోధమంతాను. తానింతకుపూర్వమే క్లబ్బునుంచివస్తూ దిగబెట్టిన ఆ స్నేహితుని ప్రాణాలు తీసివేయాలన్నంత పగవున్నదని ఎవ్వరికీ తెలియదు—ప్రపంచంలో ఒక్క భగవంతునికి దప్ప, తనమనసుకి తప్ప, ఆఖరికి కమలకుకూడ తెలియదు. ఎంతటి బుద్ధిహీనుడా సీతాపతి! రేపు ప్రాణముతీస్తూవుంటే ఒక్కసారి గ్రహించుకొని తెల్లబోతాడు కాబోలు. అసలు మొన్న అతడు వేటకి గంగవరముపోతానని చెప్పిననాటినుండి పగతీర్చుకుందామన్న ఆశ తనని వూపివేస్తూవుంది. రేపు ఏదో పొరబాటువలన హత్య జరుగకపోయినప్పటికీ తనకడుపులోని హత్యాలోచన ఎవరికీ తేటపడదు. అదే తన ప్లానులోని చమత్కారము.

ఈ కేసులో ప్రపంచానికి హత్యని అసలు తెలిస్తేగా పోలీసులు వుద్దేశాన్ని వెదక పూనుకుంటారు? సీతాపతి చావు హత్యని తెలవనిస్తాడా తాను? సీతాపతికి ఏదో కర్మం కాలి, గ్రహచారం చాలక ఆకస్మికముగా సంభవించిన అత్యంత ఘోరసంఘటనమని తోచాలి లోకానికి. వెనుకటికొకసారి యిదే గంగవరముమేడలో పిస్తోలు శుభ్రముచేస్తూ సీతాపతి పులినోటికందయై మృత్యువు తప్పించుకోలా? అప్పుడు తానక్కడ వుండలే?

ఆలాగే యిది ఇంకొక పొరబాటు. ఈసారి ప్రాణమేపోయిందనుకొంటారు బంగళాలో. ఒక్కణ్ణి శేపు చూచి రామారావన్నా దగ్గరుంటే లండనులో చదివిన గొప్పడాక్టరు గనుక వెనుకటికి వలెనే వెంటనే వైద్యసహాయంచేసి మిత్రుని ప్రాణము కాపాడినాడు అని అందరూ అనుకుంటారు. ఎంతటి భీభత్సము చిటికాలములో జరిగిపోయింది అని ప్రజలు అనుకుంటూవుంటే తాను గ్రుడ్లనీళ్లు గ్రుడ్లను కుక్కుకోవద్దూ! స్వయంగా తాను మిత్రుని యంత్యక్రియలకుగా అన్నియేర్పాట్లు చేయాలి. సీతాపతి భార్య గొల్లుమంటే తానుకూడ నిస్పృహుడై కన్నీరు కార్చాలి. ఆమె దుఃఖసముద్రములో తాను చేయూతగా తోచవద్దూ!

... ... ...

సీతాపతి నడుమ రాకపోతే కమల తనభార్య అయ్యేదికాదూ! తనపెండ్లికెన్ని రాయభారాలు తన మేనమామ పంపలే. ముందు ఒప్పకోకపోయినా కమల తండ్రి చావుబ్రతుకులమీదవుండి బిడ్డను గుప్పెడు గింజలూ పోసి మరణించాలని ఒప్పుకోలా! ఇంతలో అప్పుడే లండనునుండి తిరిగివచ్చి డబ్బుకాశపడక కట్నము తీసుకోకుండా కమల చక్కదనానికి వ్యామోహపడి చటుక్కున ఆమెను పెండ్లిచేసుకున్నాడు సీతాపతి. ఈ సీతాపతే భూమిమీదలేకుండావుంటే ఆస్తిపాస్తులతో, కట్నంకానుకలతో కమల డాక్టరు రామారావుగారి భార్యయై విలసిల్లేదిగా! అన్నా! ఎంత దుర్మార్గుడు! తనకనుకున్న సంబంధానికి తాను మనసారవలచి పెండ్లాడనున్న పిల్లకి అడ్డము వస్తాడుగా! రెడ్లలో చదువుకున్నపిల్ల ఒక్కతనేగదూ పోటీమీద చేసుకున్నాడు...

ఈ ఆలోచనా బిగువుచేత రామారావు కణతలపైని నరాలుబ్బి ఆతని మానసికోద్వేగాన్ని చూపిస్తూవున్నాయి. చిరుచెమ్మటలు ముత్యాలసరములాగు నుదుటిపై నిల్చినవి.

సీతాపతిని చంపాలన్న ఉద్దేశము కమలపెండ్లినాడు, ముసిముసినగవులతో ఆమె తలంబ్రాలు వరునిమీద పోస్తూంటే కలిగింది! ఏమిటో! ఎలక్ట్రిక్కుతీగ తగిలితే ఎంతబాధకల్గుతుందో అంతఆవేదనకల్గింది తనకు. అసలీ సీతాపతన్నవాడే భూమిమీదలేకపోతే - ఈనాడే పెండ్లియగునా? అని స్పృహకుతట్టింది. ఇప్పటికయినా ఏమంత మించిపోయింది, ఈరోజుల్లో పునర్వివాహాలు అపురూపముకాదుకదా! కమలతన్ను పెండ్లాడినాసరే, లేకపోయినాసరే, కమల సీతాపతికి సౌఖ్యమివ్వకూడదు. అంతేకావాలి తనకు. లగ్నమునాడే 'చంపేద్దామా' అన్నంతకోపమువచ్చింది కాని ఆనాడింత తీవ్రమైన ఆలోచనకలుగలేదు తనకు.

ఆనాటినుండీ ఏవో పిచ్చిపిచ్చి ప్లానులువేయడమూ అవి అంతరించిపోవడమూ ఇలాజరుగుతోంది. కాని అన్నియాలోచనల పరిణామము ఒకటే 'సీతాపతివధ.' అర్ధరాత్రివేళ మెలకువవస్తే కమల జ్ఞాపకాని కొచ్చి యిన్నేండ్లుగా ఆపివుంచి, దాచివుంచినప్రేమ వెల్లువరాగా ఎంతవేదనపడేవాడు తాను! ఆచీకట్లో కమలఏంచేస్తుందోగదా అని యనుకొని సీతాపతికౌగిట్లో నిద్రపోతూన్నట్లు మనోదృశ్యాన్నికాంచి తప్పక కమలపెనిమిటిని చంపాలని తీర్మానించుకుని మరీ నిద్రపోయేవాడు.

అసలేమిజరిగిందంటే, శుక్రవారమునాడు సీతాపతి రామారావుని తనయింటికి భోజనానికి రమ్మన్నాడు. ఏడాదిక్రితమారోజునే వాండ్ల పెండ్లైనరోజని ఎదో ఈవొక్కమిత్రుణ్ణే ఆ దంపతులు భోజనానికిపిల్చారు. భోజనాలప్పడేవో కబుర్లుచెప్పకుంటూ, 'వికారాబాదు బంగళా జర్మనుపద్ధతిమీద విప్పి కట్టించాను. పనిమొదలుపెట్టిననాటినుండి మీ అమ్మ ఖాయలాకి లక్షసార్లు మా యింటిమీదుగా తాండూరు

వెళ్లావుకాని ఒక్కసారీ కారునిలిపి బంగళాచూడకపోతివి. రేపు శనివారము వెడుతున్నాను రాకూడదురా? అన్నాడు సీతాపతి.

భోజనానంతరము మళ్లీ రెండుగంటలు లోకాభిరామాయణమైన తరువాత రామారావులేచాడు. సీతాపతి 'రేపు వస్తావుగా' అన్నాడు. 'సరే' నని తలవూపి తనకారుఎక్కి, సిగరెట్టు ముట్టించుకొని బ్రుర్రున వెళ్లిపోయాడు రామారావు.

రామారావు యింటికివెళ్లి బట్టలుమార్చి దీర్ఘాలోచనలో పడ్డాడు. తీరా యిన్నాళ్లు ఎదురుచూచి తనమనస్సులో హత్తుకొనివున్న సీతాపతి హత్యాసమయం వచ్చేసరికి ఏమిటో 'తుదకేమవుతుందో' అన్న చిన్నభయము తనకుతెలియకుండానే తన హృదయంలో పనిచేస్తోంది నిద్రపట్టకపోతే లేచి తన పడకకుర్చీలో కూర్చుని టైము చూస్తే రేపీవేళకంతా ముగించి తాను తాండూరు వాయువేగముతో సమీపిస్తూ వుండాలి కదూ!

ఆ వికారాబాదు బంగళా, కూలకొట్టి మళ్లాకట్టించుటకు పూర్వము ఒకనాడు తనను తలనెప్పి బ్రద్దలు చేస్తూందంటే సీతాపతి బలవంతపెట్టి దూరప్రయాణంకు తీసుకువెళ్లి, ఇంతదూరమువచ్చాక యింటి దగ్గరే నాలుగునిమిషాలు విశ్రమిద్దామని అక్కడకు లాక్కుపోయాడు. అప్పుడు కమల కూడావుంది వెంబడి. ఆ దృశ్యము జ్ఞాపకానికివచ్చింది. భార్యను ప్రక్కన కూచోపెట్టుకొని తన్ను వెనకకూలేశాడు వెధవ!

తీరా బంగాళా తాళముతీసి 'డ్రాయింగురూము' లోని పెద్దటేబుల్ లైటు వెలిగించేప్పటికి 'అబ్బ దెయ్యాలకొంపలా వుంది ఎవరికీ తెలియకుండా హత్యకూడా చేయవచ్చు' అంది కమల. 'రేపు విప్పి కట్టించి, రేడియో ఒకటి, ఎలక్ట్రిక్ దీపాలు పెట్టితే ఎలావుంటుందో చూడు' అన్నాడు సీతాపతి. కమల రిమార్కు జ్ఞాపకముచేసుకుని ఒక చిరునవ్వు నవ్వుకున్నాడు రామారావు 'హత్య జరుగవచ్చు ఎవరికీ తెలీకుండా' అదీమాట. సీతాపతి కర్మను సీతాపతి భార్యనోటినుంచే శకునం పలికించాడు దేవుడు.

నిదానముగా ఆలోచన మళ్లీ మొదలుపెట్టాడు. మెట్టుమెట్టు హత్యావిధానాన్ని లెక్కింప మొదలు పెట్టాడు. ఎక్కడా తనప్లానులో పొల్లు కనబడలేదు. మొదటిమెట్టు వెంటనే తానులేచి తన గ్యారేజీలోంచి తన రెండోకారును మొన్న వారంరోజులక్రింద కొన్న క్రొత్తకారును తీసి సడిలేకుండా వికారాబాదురోడ్డు ఎక్కించి సీతాపతి బంగాళానుదాటి మిషనుస్కూలు ప్రహరీవెనకవున్న కూలిపోతూన్న చిన్నయింటిలో దాచి తాను శంకరపల్లివఱకు నడిచిపోయి అక్కడ బొంబాయినుంచి వస్తూన్న మెయిలు ఎక్కి తిన్నగా తెల్లవారేసరికి హైద్రాబాదువచ్చి దిగడము.

ఈసారి ఏంచెయ్యాలంటే సోంపల్లిస్టేషనులో దిగక సరాసరి హైదరాబాదు టిక్కట్టు తీసికొనక సికింద్రాబాదుకు తీసుకుని ప్రొద్దుట 6-30 కు అక్కడ దిగి, తాను సీతాపతియింట్లో భోజనంచేస్తుండగా రెండుసార్లు వచ్చిన టెలిఫోనువార్తప్రకారము, వాకరుటౌనులో మొదల్యారుగారింటికి నడచివెళ్లి, రోగిని చూచుకొని యింజెక్షనుయిచ్చి (మందులపెట్టి తప్పక తీసుకుపోవాలి అని జ్ఞాపముచేసుకుంటూ) వాళ్ల కారులో హైద్రాబాదువచ్చేసి, ఆనాడు ఆసుపత్రిలో పనిచూచుకొని, తను అమ్మదలచుకున్న పాతకార్లో వికారాబాదు బైలుదేరాలి, ఆస్పత్రినుండే.

ఇక రెండోమెట్టు మత్తును గలిగించే పొడి సిద్ధముచేసుకొనడం. చప్పునలేచి రామారావు తన మందుల పెట్టి తెరిచి మత్తుమందుతీసి ఒక పొట్లముకట్టి తన మనీపర్సులోపల భద్రముగాపెట్టి జేబులో పెట్టుకున్నాడు.

ఇక మూడోమెట్టు. ఇనుపపెట్టి తెరిచి తళతళ మెరుస్తూన్న క్రొత్త పిస్తోలు తెరిచి మందు దట్టముగా కూరాడు.

ఇంతలో గడియారము 12 కొట్టింది. ఆలోచన ముగించి చప్పనలేచి నిశ్శబ్దముగా దుస్తులు వేసికోవడము మొదలుపెట్టాడు. తాను ఎన్నడూ వేసుకునే షేర్వాణీ, పైజామారుక్కా దోవతికట్టి, నెహ్రూసదరా తొడిగి ఉత్తరీయము కప్పుకున్నాడు. జేబులో వస్తువులన్నీ జాగ్రత్తచేసుకొని, గ్యారేజీదగ్గరకు నడిచిపోయి తన క్రొత్తకారును ఎక్కి బంగాళాముందుకు వచ్చాడు. అతని అదృష్టానికి ఆనాడు తనయింట్లోని బోయికి జ్వరమువచ్చి వాడు పనికిరాలేదు. వంటవాడు, చోక్రాతల్లికి పరిచర్యచేయడానికి తాండూరులో వున్నాడు. గేటుకి తాళమువేసి 45 మైళ్ల స్పీడుమీద $1\frac{1}{2}$ లో వికారాబాదుచేరి, మిషనుకాంపౌండును సమీపించి దాని వెనుకనున్న పాతబడి సగము పడిపోయిన చిన్న ఇంటిలోకి కారునిపోనిచ్చి, తానుదిగి మందులపెట్టె చేత్తో పట్టుకుని, టార్చిలైటు సహాయాన్ని ముండ్లకంపలూ కంచెలూ దాటుకొంటూ శంకరపల్లిస్టేషనువైపు నడవజొచ్చాడు. ఎంతదూరము నడిచినా ఏస్టేషనురాదు. విసుగుతో 'కార్లోవస్తే యింతదూర'మనిపించేదికాదు. యింతదూరముందా శంకరపల్లి? నాప్లానులో ఈ వివరాలు ఎందుకురాలేదో' అనుకుంటూ నడుస్తూవుంటే తెల్లవారిపోవడము మొదలుపెట్టింది. కాకులు కాకా అని కూస్తున్నవి. పొలానికి జొన్నరొట్టెలు కట్టుకొని గొంగళ్లు కప్పుకొనిపోతూన్న యిద్దరుముగ్గురు రైతులెదురుపడ్డారు. తనస్కీములో యీ వివరాలు ఎందుకాలోచించలేదు? అనుకుంటూ 'శంకరపల్లి ఎంతదూర ముందయ్యా'అని ప్రశ్నించాడొకణ్ణి. వాడు రామారావు బట్టలుచూచి ఎవరో పెద్దదొర అని భయంతో నక్కుచూ 'దొరా యింకా 4 కోసులుంది' అని బిత్తరిచూపులు చూస్తూ జవాబిచ్చాడు. 'O damn 8 miles more' అని ఇంగ్లీషులో సణుగుకుంటూ 'దగ్గర యింకేదన్న స్టేషనుందా?' అన్నాడు. 'అవునుదొరా'-చిట్టిగడ్డవుంది'. 'అక్కడబొంబాయిబండీ నిలుస్తుందా?' అని తిరిగి ప్రశ్నించాడు. 'ముత్తైమంతసేపు నిలుస్తుంది.' అన్నాడు. సరే అని సమీపములో కనపడేయిండ్లు, సిగ్నలు చిట్టిగడ్డవని తీర్మానించుకుని కాపువానికి రెండణాలు యిచ్చిపోయి వాడు దానివలన తనముఖమూ, ప్రశ్నలూ, వైఖరీ జ్ఞాపకముంచుకుంటాడేమో! ఎందుకులే అని అనుకుని యింతలో సిగ్నలువాలడము చూచి స్టేషనువేపు పరుగెత్తాడు. సికింద్రాబాదుస్టేషనులో దిగి, అక్కడనుంచి వాకరుటౌనులో గోగిని పరీక్షచేసి, కారు త్రోవలో చెడిపోతే అక్కడే బంట్రోతును కుర్చోపెట్టి గోడ్డుమీద వదలివచ్చానని చెప్పి, మొదల్యారుగారు బలవంతముచేస్తే దంతధావనముచేసికొని కాఫీ ఫలహారము తీసుకొని, వాండ్లకార్లో హైద్రాబాదు తనయిల్లు చేరాడు. అక్కడ బోయివాడు తనురాకకు బైటకూర్చని వున్నాడు. స్నానాద్యవశిష్టాలు తీర్చుకొని రామారావు సొంతకార్లో ఆస్పత్రికి పనికిపోయాడు. సాయంత్రము 5 గంటలకు సరాసరి అక్కడనుండే వికారాబాదుకు ప్రయాణమయ్యాడు. తనమనసులో 'తనప్లానులోలేని వివరాలు—ఒకవేళ కపులకూడ వస్తుందేమో! రానియ్యి ఈ ఒక్కనాటికి హత్య నిల్చిపోతుంది' అని అనుకుంటూ నిదానముగా మామూలు వేగంలో సీతాపతి కారుకొఅకు చూస్తూపోయాడు.

... ... ...

ఇంతకుముందు సాయంత్రము సీతాపతి వేటకొఅకు కావలసిన సామానులన్నీ తీసుకుని రాత్రికి భోజనము టిఫిను పెట్టిలోపెట్టి భార్యయిస్తే రాముడికికూడా కట్టావా లేదా? అని విచారించి కారులో నాలుగు గంటలకే బైలుదేరుటచేత త్వరగా చేరాడు. త్రోవలో ఎక్కడా రామారావతనికి అగుపడలేదు. ఇంతలో రామారావు కారు హారను వినపడగా ఎంతో ప్రేమ కండ్లలో చూపుతూ పాపము సీతాపతి రామారావు కారుదగ్గరకువెళ్లి తీసుకువచ్చాడు. 'ఇంతాలస్య మెందుకయిందిరా' అంటే 4 గంటలు 5 గంటలవఱకు పిచ్చినక్క పొలాల్లో చాలామందిని కరచిందట. వాండ్లను తీసుకువచ్చి పడవేశారు ఆస్పత్రిలో. దానికి

**special injections** యిచ్చి బైలుదేరేసరికి పొద్దుపోయిందన్నాడు రామారావు. అతనికేమిటో యిన్నాళ్లు వుంచిన అసూయ వెల్లువగా వచ్చి తలను దిమ్మగా చేస్తూంది. సీతాపతితో మాట్లాడుటకే మనసురావడము లేదు. ఎప్పుడు పిస్తోలుతో కాల్చి పారేద్దామా అని వుంది. 'ఇల్లు చూపించోయి, నేనింకా తాండూరు పోవాలి' అన్నాడు. 'పోవచ్చులే. రేడియోలో యివ్వాళ మంచి ప్రోగ్రాము వుంది. గాంధిగారి ఉపన్యాసము వినిపిస్తారట. కమల నీక్కూడా భోజనము కట్టింది. భోంచేసుకుని వెడుతువుగాని లే' అన్నాడు సీతాపతి.

రా : భోజనము కమలే కట్టిందా. నీవు కట్టమంటే కట్టిందా !

సీ : లేదురా ? తానే కట్టింది అని చెప్పి యిల్లు చూద్దాము అని లేచాడు. హాల్లోకివెళ్లి ప్రక్కనున్న తలుపు తెరవబోతే తాళమువేసివుంది. 'ఉండు తాళముచెవి తెస్తాను' అని బైట వసారాలో ఒక బోర్డుకున్న హుక్కులకన్నీ వ్రేళ్లాడగట్టివున్న చోటికి వెళ్లాడు. ఇంతలో చప్పున హాల్లో రౌండుటేబిలు మీదున్న టిఫినుబాక్సు, మంచినీళ్ల సీసా, థర్మ్మోఫ్లాస్కు చూచి, థర్మాఫ్లాస్కును తెరిచి జేబులో వున్న పర్సులోని మత్తుమందుపొట్లము విప్పి కాఫీలోకి పోసేసి సీసా తలక్రిందులుగా 2 సార్లు కదిలించి మూతేసిపెట్టేసాడు. ముందు అమర్చిన కప్పులో కొంచెము కాఫీ పోసుకున్నాడు చల్లారాక తాను తాగడానికి. ఇంతలో సీతాపతి తాళముచెవి తీసుకువచ్చాడు. కాఫీ త్రాగుతూవున్న రామారావును చూచి 'ఔనోయి నేనూ తాగాలి' అని కాఫీ పోసుకుని తాగుతూ 'ఏమిటో చిరుచేదుగా వుంది కాఫీ' అన్నాడు. 'స్ట్రాంగు కాఫీ, థర్మ్మోఫ్లాస్కులో పోస్తే అల్లాగే వుంటుంది. పై తేట నేను తాగాను, అడుగు మడ్డి గనుక మరీ చేదుగా వుంద'న్నాడు. 'ఐనా నాకేదో వాసనవచ్చింది, నాలుక తిమ్మిరనిపించిందికూడ'అని తాళము యిదేనా అన్నాడు.

సీతాపతి లేచి నడువబోయి నాకేమో తలతిరుగుతుందోయి అని సోఫాలో జేరగిలబడి కళ్లు మూసుకున్నాడు. అయ్యో, ఏమయిందీ అని నాడిచూస్తూ తాను దగ్గర కూర్చున్నాడు. కొంచెంసేపటికి సీతాపతికి బాగా నిద్ర పట్టిపోయింది.

...    ...    ...

రామారావు ఒక్కసారి సీతాపతివేపు చూచాడు. అతను బాగా గాఢనిద్రలో వున్నట్లు గుఱ్ఱుపెట్టుటవల్ల తెలిసింది. గప్పున షేర్వాణీ జేబులోనున్న రివాల్వరుతీసి కాల్చపోయాడు యిదే సమయంగదా అని. గాఢనిద్రా మైకముతో సోఫాలో జేరగిలబడివున్న స్నేహితుని ముఖముచూస్తే యింత సుఖముగా నిద్రలోనే ప్రాణాలుపోతే తాను తన్నెందుకు చంపాడో సీతాపతి కెలాతెలుస్తుంది ? ఫలాని కారణముకొఱకు ప్రాణాలివ్వవలసివస్తూందని సీతాపతికి తెలియవద్దూ ! తాను పగతీర్చుకోవద్దూ ! సీతాపతి కండ్లల్లో భీతీ, దైన్యమూ తాను చూడవద్దూ ! పరమమిత్రుడనుకున్నవాని పాము పగ అర్థమయి సీతాపతి ఒక్కసారి మతి విభ్రమాన్ని అనుభవించవద్దూ !

చప్పున ఈ ఆలోచన రావడముతోనే, లేచి వసారాలోకిపోయి దండెమును త్రెంపి ఆ త్రాటిని తెచ్చి సీతాపతి కాళ్లూ చేతులూ కట్టివేసి, ఆతని కడుపుమీదగా త్రాడుతిప్పి సోఫాకే గట్టిగా కట్టివేశాడు. రామారావుకీ పనులన్నీ చేస్తూంటే ఏమిటో శీతలము కమ్మి చిఱుచెమటలు పోస్తున్నాయి. కాళ్లు వణుకుచున్నాయి. చేతులు వంకరలు పోతున్నాయి. ఇట్టి చిహ్నాలు హంతకునికి కలుగునని అతని ప్లానులో లేదే !

ఇంతలో కనురెప్ప లల్లార్చి నలుదిక్కులు సగము మైకముతో చూస్తున్నాడు ఏమీ పాలుపోక, సీతాపతి. కొంతసేపటికి దృష్టి రామారావుమీద పడి, అతన్ని గుర్తుపట్టి, 'ఎక్కడున్నాము, ఏమైంది' అని ప్రశ్నించాడు. రామారావు 'ఏమీలేదు. నేనే నీకు మత్తుమందిచ్చాను. అద్భుతంగా పనిచేసింది కదూ?'

సీ: (మత్తు వదలక చేతులు చాచబోయి నిమీలితనేత్రాల్తో) నన్నెందుకు కట్టేశారు?

రా: నిన్ను చంపడానికి ముందు నీతో కొన్ని ముఖ్యవిషయాలు చెప్పాలని ఈలా జాగ్రత్తపడ్డాను.

అదెందుకో యిప్పుడే తెలుస్తుంది. (పండ్లు పటపట కొరుకుతూ) ఇన్నాళ్లకు నాచేతికి చిక్కావురా? అని ఒక్క వెగటునవ్వు నవ్వాడు.

అతని కండ్లల్లోని ఆక్రోధమూ అసూయా చూచేసరికి పూర్తిగా తన నిస్సహాయస్థితి అర్థమైంది సీతాపతికి. తననట్లా కట్టివేసి ఆ పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడడము తప్పకుండా ఏ పాటో రామారావుకు పిచ్చెత్తింది అనుకున్నాడు.

రా: నాకు తెలివి తప్పిందనుకోకు. ఈ దినమున్నంత బుద్ధి తీక్ష్ణత నాకేనాడూ ఉండలేదు. ఏండ్లకొలదీ, మన బాల్యంనుంచీ నీమీద పెరిగిన ఈర్ష్యయొక్క సహజ పరిణామమే ఈ దిన మీపని చేయించుచున్నది. అసలు—విను అన్నిటికంటే ముఖ్యము—నేను చేసుకోవాలన్న పిల్లను దాసీసంబంధమని చెప్పి తప్పించి నీవు చేసుకోవడముతో నిన్ను తప్పక చంపాలని తీర్మానము చేసుకున్నా.

సీతాపతికంతా అర్థమైపోయింది. నిశ్శబ్దముగా దిక్కులుచూస్తూ కూర్చున్నాడు. ముఖముమీద అగుపడకపోయినా మనసులో భయము పుట్టింది. రామారావు న్మత్తుడుకాడు. అపాయమును కల్గించ వూనుకొన్న అసూయాగ్రహపరుడు.

సీతాపతి నుదుటిమీదనరాలు చిక్కి బాగా అగపడుతున్నయి. చేతిబంధాలు వదులు చేసుకోవడానికి అటుయిటూకదుల్తూ కాళ్లూ చేతులూ కదలిస్తూ అవస్థపడుతున్న వాడల్లా యిక ఆశలేదు. అంత్యము సమీపిస్తూవుందని, తలవెనక్కివాల్చి జుగుప్సతో స్నేహితుణ్ణిచూస్తూ దైవాన్ని ప్రార్థిస్తున్నాడు మనస్సులో తనకు జాతకంలో 31ఏట గండమన్నా రిదేకాబోలనుకుంటూ. రామారావుచూపులో ఈర్ష్య, క్రోధము ఘనీభవించినట్లగుపడుచున్నవి.' ఇదిగోచూడు ఈపిస్తోలు చూశావా? ఈనాగడ్డముక్రింద ఎలా పెట్టానో అలానీగడ్డముక్రింద కంఠానికి సూటిగాగురిపెట్టి ఈమీటను లాగితే ఈ నాప్రాణముకాస్తపోదూ? అలాగే నీకంఠానికి గురిపెట్టి కాల్చేస్తాను.' చేతిలోవున్నపిస్తోలు తనగడ్డముక్రింద తనకంఠానికి సూటిగా గురిపెట్టి మాట్లాడుతూవున్నాడు.

హాల్లోంచి 'హల్లో' అన్న ఎవరిదోపరాయవాండ్ల కంఠస్వరము బిగ్గరగావినపడ్డది. త్రుళ్లిపడ్డాడు రామారావు. మళ్లీ అంతానిశ్శబ్దము 'హల్లో మహాత్మగాంధిగారు అమెరికాలో యిచ్చిన ఉపన్యాసంవినండి' అని రేడియోలో పిలుపుప్రారంభం అయినతరువాత అరగంటవరకు బాపూజీయిచ్చిన ఉపన్యాసం వినేవారెవ్వరూ అచ్చట లేకపోయారు. ఆ నిశ్శబ్దముగావుండే ఆ పెద్దహాల్లో "There is an indefinable mysterious power that exists" అన్న ధోరణిలో గాంధిగారిలెక్చరు అద్భుతంగా వినపడుతోంది.

'హల్లో' అని వినపడ్డప్పుడు గభీమని ఉలిక్కిపడడములో రామారావు గడ్డముక్రింద పిస్తోలు గురిపెట్టి పట్టుకొనివుండుటచేత బొటనవ్రేలు మీటలోవుండుటచేతను, తత్తాలున పిస్తోలుప్రేలి వూరుకుంది. అసలు మందుదట్టముగా కూర్చిన పిస్తోలుకూడ. జన్మలో ఎన్నడు మూర్ఛిల్లలేదు సీతాపతి, మొదటిసారి కొయ్యబారిపోయాడు. అసలు రామారావు దుస్తులనుపట్టి ఫలానామనిషని పోలీసు తర్వాత తేల్చారు.